# విద్యుత్తు ప్లాంట్లపై న్యాయవిచారణ

- ఛత్తీస్‌గఢ్ కరెంట్ కొనుగోళ్లపై ఎంక్వైరీ
- 24 గంటల కరెంటుపై నిర్ధారణ కమిటీ
- అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన



హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పవర్ ప్లాంట్ల నిర్మాణాలు, ఛత్తీస్‌గఢ్‌తో చేసుకున్న విద్యుత్తు కొనుగోలు ఒప్పందం తదితర అంశాలపై జ్యుడీషియల్ విచారణ చేయిస్తామని అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. విద్యుత్తు రంగం మీద ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంపై జరిగిన చర్చలో బీఆర్‌ఎస్ సభ్యుడు, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పాల్గొంటూ.. యాదాద్రి పవర్ ప్రాజెక్టుకు సంబంధించి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలు తనకు వ్యతిరేకంగా చేస్తున్న ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించుకోవచ్చని అన్నారు. స్పందించిన రేవంత్‌రెడ్డి.. ఛత్తీస్‌గఢ్‌తో చేసుకున్న 1000 మెగావాట్ల ఒప్పందం వల్ల తెలంగాణపై రూ.1362 కోట్ల భారం పడిందని, యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులో వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారాలపై జ్యుడీషియల్ విచారణ జరిపిస్తామని చెప్పారు. రాష్ట్రంలో 24 గంటల కరెంట్ సరఫరాపై కూడా అఖిలపక్షంతో నిజనిర్ధారణ కమిటీ వేద్దామని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్తు బకాయిలు చెల్లించని ప్రాంతాలలో సిద్దిపేట, గజ్వేల్, హైదరాబాద్ సౌత్ మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయని తెలిపారు. ఆయా స్థానాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న హరీశ్‌రావు, కేసీఆర్, అక్బరుద్దీన్‌లు బకాయిలు చెల్లించే బాధ్యత తీసుకోవాలని అన్నారు.

# విద్యుత్తు సంస్థల అప్పులు 81,516 కోట్లు!

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని నాలుగు విద్యుత్తు సంస్థలు (ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్) కలిపి చేసిన అప్పుల మొత్తం రూ. 81,516 కోట్లకు చేరుకున్నాయని ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో విద్యుత్తుపై విడుదల చేసిన శ్వేతపత్రంలో పేర్కొన్నది. ఇప్పటి వరకు డిస్కంలకు (ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్) వాటిల్లిన నష్టాలు రూ. 62,461 కోట్లు ఉన్నాయంటూ లెక్కలు తేల్చారు. ఇప్పటి వరకు విద్యుత్తును వాడుకున్న ఆయా ప్రభుత్వ శాఖల నుంచి రూ. 28,842 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని పేర్కొన్నారు. విద్యుత్తు కొనుగోళ్లలో వాస్తవ సర్దుబాటు చార్జీల కింద (ట్రూఅప్ చార్జీలు) రూ. 14,928 కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలో పేర్కొన్నదాని ప్రకారం.. నాలుగు విద్యుత్తు సంస్థలకు సంబంధించిన అప్పులు ఇలా ఉన్నాయి. డిస్కంల నష్టాలకు సంబంధించి రాష్ట్రం ఏర్పడేటప్పటికి అంటే 2-6-2014 నాటికి డిస్కంల (ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్) మొత్తం నష్టాలు రూ.12,186 కోట్లుగా ప్రభుత్వం చూపించింది. గడిచిన తొమ్మిదేండ్లలో (2022-23 నాటికి) అదనంగా రూ. 50,275 కోట్ల నష్టం వాటిల్లిందని, మొత్తం రూ. 62,461 కోట్ల నష్టాల్లో డిస్కంలు నడుస్తున్నట్టు శ్వేతపత్రంలో పేర్కొన్నారు. విద్యుత్తు కొనుగోలు కోసం సింగరేణికి కూడా రూ. 19,431 కోట్ల బకాయిలు పేరుకుపోయినట్టు అందులో వివరించారు.

| సంస్థ/అంశం | జూన్ 2, 2014 నాటికి (రూ. కోట్లలో) | 2022-23 నాటికి (రూ. కోట్లలో) |
|---|---|---|
| జెన్‌కో మొత్తం అప్పులు | 7,662 | 32,792 |
| ట్రాన్స్‌కో మొత్తం అప్పులు | 2,411.12 | 10,529.92 |
| డిస్కంల మొత్తం అప్పులు | 10,783 | 35,227 |
| మొత్తం అప్పులు | 20,856.12 | 78,548.92 |

2022-23 ఆర్థిక సంవత్సరం నాటికి మొత్తం అప్పులు రూ. 78,548.92 కోట్లు కాగా, అక్టోబర్ 31, 2023 నాటికి ఈ అప్పుల మొత్తం రూ. 81,516 కోట్లకు చేరుకుందని ప్రభుత్వం శ్వేతపత్రంలో పేర్కొంది.

# పెరిగిన స్థాపిత విద్యుత్తు వినియోగం

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆవిర్భావ సమయంతో పోల్చితే ప్రస్తుతం విద్యుత్తురంగంలో రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధించినట్టు శ్వేతపత్రం స్పష్టం చేసింది. రాష్ట్ర ఏర్పాటు సమయానికి 7,778 మెగావాట్ల స్థాపిత విద్యుత్తు వినియోగం ఉండగా, ప్రస్తుతం అది 19,475 మెగావాట్లకు చేరినట్టు ప్రభుత్వం శ్వేతపత్రంలో పేర్కొన్నది.

### తెలంగాణ ఆవిర్భావం నుంచి జనవరి 1, 2023 వరకు రాష్ట్ర విద్యుత్తు రంగం స్థితిగతులు గణాంకాలతో..

| వివరాలు | రాష్ట్రం ఏర్పడేనాటికి (జూన్ 2, 2014) | ప్రస్తుత స్థితి (01-01-2023 నాటికి) |
|---|---|---|
| స్థాపిత విద్యుత్ సామర్థ్యం | 7,778 మెగావాట్లు | 19,475 మెగావాట్లు |
| సౌర సామర్థ్యం | 74 మెగావాట్లు | 6,123 మెగావాట్లు |
| గరిష్ఠ విద్యుత్ డిమాండ్ | 5,661 మెగావాట్లు | 15,497 మెగావాట్లు |
| ఒకరోజులో గరిష్ఠ వినియోగం (మిలియన్ యూనిట్లు) | 128 | 298 |
| తలసరి వినియోగం (కిలోవాట్స్) | 1,356 | 2,126 |
| మొత్తం వినియోగదారులు (కోట్లలో) | 1.11 | 1.82 |
| సబ్సిడీ | రూ. 3600 కోట్లు | రూ. 11.500 కోట్లు |

### తెలంగాణ ఆవిర్భావం తర్వాత చేపట్టిన ప్రాజెక్టులు

రాష్ట్రంలో విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు చేపట్టిన ప్రాజెక్టులు రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పూర్తయ్యాయి. రాష్ట్ర ఏర్పాటు తర్వాత 1080 మెగావాట్ల సామర్థ్యంతో భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను పూర్తయింది. 800 మెగావాట్ల కేటీపీఎస్ 7వ దశను 48 నెలల్లో సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో రూ. 8.01కోట్లతో పూర్తిచేశారు. రాష్ట్ర అవతరణ అనంతరం చేపట్టిన ప్రాజెక్టుల వివరాలిలా ఉన్నాయి.

| ప్రాజెక్టు | సామర్థ్యం (మెగావాట్లలో) |
|---|---|
| ఒక 800 మెగావాట్ల కొత్తగూడెం (టీపీఎస్ స్టేజ్ 4) | 800 మెగావాట్లు |
| రెండు 600 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్టు | 1200 మెగావాట్లు |
| ఒక 600 మెగావాట్ల కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు | 600 మెగావాట్లు |
| ఆరు 40 మెగావాట్ల దిగువ జూరాల హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు | 240 మెగావాట్లు |
| నాలుగు 30 మెగావాట్ల పులిచింతల హైడ్రో ఎలక్ట్రిక్ స్టేషన్ | 120 మెగావాట్లు |
| మొత్తం | 2960 మెగావాట్లు |

# విద్యుత్తు బకాయిలు చెల్లించని ప్రభుత్వ శాఖలు

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ శాఖలు తమ విద్యుత్ వినియోగ చార్జీలను గత కొన్నేండ్లుగా చెల్లించడం లేదు. గురువారం అసెంబ్లీలో ఇంధనశాఖపై రాష్ట్ర ప్రభుత్వమిచ్చిన శ్వేతపత్రం ప్రకారం బకాయిలు ఇలా ఉన్నాయి.

### హెచ్‌వోడీ వారీగా ప్రభుత్వ శాఖల బకాయిల పట్టిక (రూ.కోట్లలో)

| హెచ్‌వోడీ పేరు | 02.06.2014 నాటికి బకాయిలు | 31.10.2023 నాటికి బకాయిలు |
|---|---|---|
| ఎల్ఐఎస్, ఇతర ప్రాజెక్టు | 150.28 | 14,193 |
| నీటిపారుదల శాఖ (కార్యాలయ సేవలు) | 3.75 | 92.04 |
| మిషన్ భగీరథ (ఎల్‌టీ+హెచ్‌టీ) | 35.40 | 3,558.83 |
| పంచాయతీరాజ్ శాఖ (మేజర్ & మైనర్) | 769.99 | 4,393.99 |
| హెచ్ఎండబ్ల్యూఎస్ & ఎస్‌బీ | 362.04 | 3,932.47 |
| మున్సిపాలిటీలు | 131.37 | 1,657.81 |
| కార్పొరేషన్లు | 7.40 | 53.68 |
| జీహెచ్ఎంసీ & హెచ్ఎండీఏ | 0.00 | 4.51 |
| హోంశాఖ | 15.65 | 27.69 |
| ఆరోగ్య వైద్య & కుటుంబ సంక్షేమశాఖ | 12.06 | 48.42 |
| రెవెన్యూ శాఖ | 10.25 | 21.03 |
| పాఠశాల విద్యాశాఖ | 4.77 | 48.37 |
| ఉన్నత విద్యాశాఖ | 1.01 | 40.43 |
| సాంఘిక సంక్షేమశాఖ | 0.09 | 0.50 |
| బీసీ సంక్షేమం | 3.24 | -1.27 |
| గిరిజన సంక్షేమ శాఖ | 0.85 | 6.55 |
| పశుసంవర్ధక శాఖ | 0.08 | 0.42 |
| పర్యాటక శాఖ | -0.20 | 2.45 |
| కేంద్రప్రభుత్వం | 82.55 | 720.34 |
| ఇతర రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు | 4.78 | 62.62 |
| ఇతర విభాగాలు (మార్కెట్ కమిటీ) | 0.00 | 0.20 |
| మొత్తము | 1595.37 | 28842.72 |

# 50 ఏండ్ల పాలనలో 6 గంటల విద్యుత్తే

## అసెంబ్లీ ముచ్చట్లు



- చేతకానితనాన్ని కాంగ్రెస్సే ఒప్పుకున్నది
- కేసీఆర్‌కు పిండం పెడ్తమని రేవంత్ అన్లేదా?
- నేదునూరు, శంకర్‌పల్లి ప్రాజెక్టులు కట్టాలి
- అసెంబ్లీలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్
- కేటీఆర్, పొన్నం మధ్య మాటల యుద్ధం



హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ 50 ఏండ్ల పాలనలో రోజుకు 6 గంటల విద్యుత్తే ఇచ్చిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కే తారకరామారావు ఎద్దేవా చేశారు. తమ అసమర్థత, చేతకానితనాన్ని కాంగ్రెస్ పార్టీనే స్వయంగా ఒప్పుకున్నదని అన్నారు. గురువారం అసెంబ్లీలో విద్యుత్తుపై లఘుచర్చలో భాగంగా కేటీఆర్, మంత్రి పొన్నం ప్రభాకర్ మధ్య మాటల యుద్ధం జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 2010 ఫిబ్రవరిలో రోశయ్య సీఎంగా ఉన్నప్పుడు తెలంగాణ ఉద్యమం ఉన్నా నేదునూరులో పవర్ ప్లాంట్‌కు ఫౌండేషన్ వేశామని, రూ.13 కోట్లు వెచ్చించి 432 ఎకరాలు సేకరించామని చెప్పారు. గ్యాస్ అలకేషన్ కాకపోవడంతో ప్రాజెక్టులో జాప్యం జరిగిందని, ఆ ప్రాజెక్టు ఎందుకు పూర్తిచేయలేదని బీఆర్‌ఎస్ నేతలు తనకు పిండ ప్రదానం చేశారని తెలిపారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ఆ ప్రాజెక్టును ఎందుకు కట్టలేదని, వాళ్లకు ఏ ప్రదానం చేయాలని అన్నారు. దీనిపై కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పుడున్న సీఎం స్వయంగా తమ నాయకుడు కేసీఆర్‌కు పిండం పెడతానని మాట్లాడారని గుర్తుచేశారు. 'మానకొండూరు నియోజకవర్గంలోని నేదునూరు, చేవెళ్ల నియోజకవర్గంలోని శంకర్‌పల్లిలో ఆనాడు యూపీఏ ప్రభుత్వం గ్యాస్ ఆధారిత విద్యుత్తు కేంద్రాలు నెలకొల్పుతామని భూసేకరణ చేశారు. టీఆర్‌ఎస్ పార్టీగా ఆనాడు ఒక్క దగ్గర ధర్నా చేయలేదు. ఒక వ్యక్తికి వ్యతిరేకంగా ధర్నా చేయలేదు. కేంద్రం నిర్ణయం తీసుకున్న గ్యాస్ ఆధారిత కేంద్రాలు ఎందుకు పెట్టడం లేదని నిరసన వ్యక్తం చేశాం. బొగ్గులేని విజయవాడలో థర్మల్ పవర్ కేంద్రం ఎందుకు పెడుతారు? బొగ్గు, నీళ్లు లేని రాయలసీమలో ఎందుకు పెడుతారు? అని నాడు తెలంగాణ ప్రయోజనాల కోసం తెలంగాణ బిడ్డలుగా గట్టిగా కొట్లాడినం. నిరసనలు వ్యక్తం చేశాం' అని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ దేశంలో గ్యాస్ ఆధారిత విద్యుత్తు కేంద్రం సఫలమైందా? నేదునూరులో గ్యాస్ అలకేషన్ అయిందా? అని ప్రశ్నించారు. ఆనాడు యూపీఏలో జైపాల్‌రెడ్డి పెట్రోలియంశాఖ మంత్రిగా ఉండి, గ్యాస్ అలకేషన్ చేయలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు టేకాఫ్ చేయాలని, నేదునూరు, శంకర్‌పల్లిలో ఆ ప్రాజెక్టులు పెడుతామని ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక పక్క అక్బరుద్దీన్ ఒవైసీ, మరో పక్క తాము మాట్లాడుతుంటే రేవంత్‌రెడ్డి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని, అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్వేతపత్రం ప్రవేశపెట్టింది ప్రభుత్వమేనని, అలాంటప్పుడు మంత్రి సమగ్ర సమాచారంతో రావాలని హితవు చెప్పారు.

## లోకం పోకడ




# రేవంత్‌లా పదవుల కోసం పార్టీలు మార్చలేదు

- తెలంగాణ రాష్ట్ర సాధన వ్యూహంలో భాగంగానే కాంగ్రెస్, టీడీపీతో పొత్తు
- సిద్దిపేట, గజ్వేల్, ఓల్డ్ సిటీలో కాంగ్రెస్ గెలవదని సీఎం రేవంత్ రెడ్డికి అక్కసు
- అసెంబ్లీలో సీఎంపై హరీశ్‌రావు ఆగ్రహం



హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాధన కోసమే తాము ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకున్నామని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డిలా స్వార్థంతో పదవుల కోసం పార్టీలు మార్చలేదని ఎద్దేవా చేశారు. గురువారం అసెంబ్లీలో విద్యుత్తుపై జరిగిన లఘు చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యుత్తు బకాయిలు చెల్లించని వాటిలో తొలి స్థానంలో సిద్దిపేట 61.37 శాతం, రెండో స్థానంలో గజ్వేల్ 50.29 శాతం, మూడో స్థానంలో హైదరాబాద్ సౌత్ 43 శాతం బకాయిలు ఉన్నాయని తెలిపారు.'సిద్దిపేటలో హరీశ్‌రావు, గజ్వేల్‌లో కేసీఆర్, హైదరాబాద్ సౌత్‌లో అక్బరుద్దీన్ బకాయిలు చెల్లించే బాధ్యత తీసుకోవాలి. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో విద్యుత్తు కోతలే లేవన్నట్టు జగదీశ్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నడైనా రైతులు రోడ్డెక్కారా? అని జగదీశ్‌రెడ్డి అడిగారు. కామారెడ్డిలో సెప్టెంబర్ 1న సబ్‌స్టేషన్‌ను రైతులు ముట్టడించి నిరసన తెలిపారు. సూర్యాపేట జిల్లా నెరేడుచర్లలో రైతులు రోడ్డెక్కారు. కరెంట్ సరిగా లేక పంటలు దక్కక కొమురయ్య అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఆనాడు శ్రీశైలం విద్యుత్తు సొరంగం బ్లాస్ట్ అయి 9 మంది మరణించారు. ప్రమాదంలో ఫాతిమా అనే అమ్మాయి చనిపోతే కాంగ్రెస్ ఆదుకున్నది. కానీ ఆనాటి సీఎం, విద్యుత్తు శాఖ మంత్రి కనీసం ఆ కుటుంబాలను పరామర్శించలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దుర్మార్గాలను సభలో ఎంఐఎం కనీసం ప్రస్తావించలేదు. తన పాత స్నేహితుడిని రక్షించుకునేందుకు అక్బరుద్దీన్ శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. అలాంటి వారితో స్నేహం ఎంఐఎంకు మంచిది కాదు. మైనార్టీల విషయంలో కాంగ్రెస్ చిత్తశుద్ధిని శంకించాల్సిన పనిలేదు. ఎన్టీఆర్ హయాం నుంచి కేసీఆర్ హయాం వరకూ ఎవరు ఎవరితో దోస్తీ చేశారో అందరికీ తెలుసు' అని రేవంత్‌రెడ్డి అన్నారు. రేవంత్ వ్యాఖ్యలను హరీశ్‌రావు తప్పుబట్టారు. 2004లో తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తామంటే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నామని, కామన్ మినిమం ప్రోగ్రామ్‌లో పెట్టి, రాష్ట్రపతి నోట చెప్పి కూడా ఆ తర్వాత కాంగ్రెస్ మోసం చేసిందని గుర్తుచేశారు. ఆ పరిస్థితిలో టీడీపీతో పొత్తు పెట్టుకున్నామని తెలిపారు. తాము టీడీపీతో, కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకున్నా.. ఎవరితో పొత్తు పెట్టుకున్నా ఈ రాష్ట్ర, దేశ రాజకీయ వ్యవస్థను ఒప్పించి, మెప్పించి తెలంగాణను సాధించామని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ కృషితోనే తెలంగాణ వచ్చిందని తేల్చి చెప్పారు. సీట్లు, ఓట్ల కంటే రాజకీయ వ్యవస్థను ఒప్పించి, రాష్ట్రాన్ని సాధించాలనే వ్యూహంతోనే పొత్తులు పెట్టుకున్నామని వివరించారు. రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా పదవుల కోసం పార్టీ మారారని ఆరోపించారు. సిద్దిపేట, గజ్వేల్, ఓల్డ్ సిటీలో కాంగ్రెస్ గెలవలేదని అక్కసుతోనే అలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆ మూడు నియోజకవర్గాల ప్రజలను బద్నాం చేయటం సబబు కాదని చెప్పారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేను, ప్రజలను రేవంత్‌రెడ్డి అవమానపర్చారని, ఇది సరికాదని వెల్లడించారు.

## ఇరిగేషన్‌పై శ్వేతపత్రం లేకుండానే ముగిసిన సభ

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): శాసనసభ సమావేశాల్లో నీటిపారుదలశాఖపై శ్వేతపత్రం విడుదల చేస్తామని తొలుత చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం.. చివరకు విడుదల చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం.. ఆర్థిక, విద్యుత్తు, నీటిపారుదల శాఖలపై చర్చించాలని భావిస్తున్నదని శాసనసభలోనే ప్రభుత్వం చెప్పింది. ఈ మేరకు బుధవారం ఆర్థికశాఖపై శ్వేతపత్రం విడుదల చేయగా, గురువారం విద్యుత్తు శాఖ స్థితిగతులపై విడుదల చేశారు. శుక్రవారం నీటిపారుదల శాఖపై శ్వేతపత్రం ఉంటుందని, అసెంబ్లీ కొనసాగుతుందని అందరూ భావించారు. కానీ, ఆ శాఖపై ఎలాంటి శ్వేతపత్రం లేకుండానే ప్రస్తుత శాసనసభ సమావేశాలను ముగిస్తున్నట్టు ప్రకటించారు.

## చేయని తప్పుకు శిక్ష.. బీఆర్‌ఎస్ ఓటమి

- సభ గౌరవాన్ని కాపాడుకుందాం: పోచారం

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): శాసనసభలో విద్యుత్తు రంగంపై గురువారం చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్ష నేతలు పరస్పరం వ్యక్తిగత దూషణలకు దిగారు. ఈ క్రమంలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి జోక్యం చేసుకొన్నారు. కొన్నిసార్లు తప్పు చేయకున్నా శిక్ష అనుభవించాల్సి వస్తుందని, బీఆర్‌ఎస్ ఓటమి ఆ కోవలోకే వస్తుందని చెప్పారు. అంతమాత్రాన పదేపదే దానిని ఎత్తిచూపుతూ విమర్శలకు దిగడం సరికాదని సూచించారు. ప్రజలు మళ్లీ ప్రతిపక్షాన్ని అధికారంలోకి, అధికారపక్షాన్ని ప్రతిపక్షం వైపు కూర్చోబెట్టగలరని పేర్కొన్నారు. సభలో వ్యక్తిగత దూషణలకు దిగకుండా అర్థవంతమైన చర్చ కొనసాగేందుకు అందరూ కృషి చేయాలని ఇరు పక్షాలకు హితవుపలికారు.

# డామిట్.. కథ అడ్డం తిరిగింది!

మొదటిపేజీ తరువాయి...

మైనారిటీ సెల్ కాదని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక జరిగిన తొలి శాసనసభ సమావేశాలు జరిగిన తీరు, ఆ పార్టీ ప్రభుత్వం అనుసరించిన తీరుపట్ల సర్వత్రా విస్మయం వ్యక్తం అవుతున్నది. పదేండ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను ఎత్తిచూపి కేసీఆర్ సర్కార్‌ను బోనులో నిలబెట్టాలని చేసిన ప్రయత్నం బెడిసికొట్టిందనే వాదనలు వినిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించింది బీఆర్‌ఎస్ పార్టీ అనేది వాస్తవం. రాష్ట్రానికి తాగునీళ్లు, సాగునీరు ఇచ్చింది, వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చింది, అన్ని రంగాలకు 24 గంటల కరెంట్ ఇచ్చిన అంశం ప్రజల కండ్ల ముందు కనిపిస్తున్న అంశాలు.. నిజాలను అబద్ధాలుగా ప్రచారం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రాలు అనే తప్పుడు తతంగాన్ని మొదలుపెడితే అది అధికార పక్షానికే తిరగబడి బూమరాంగ్ అయిందనే వాదనకు బలం చేకూరుతున్నది. ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఏ అంశంపై మాట్లాడినా గణాంకాలతో సాధికారికంగా మాట్లాడతారని, ఆషామాషీగా మాట్లాడరని ప్రజలే కాకుండా రాజకీయ విశ్లేషకులు భావిస్తారు. అటువంటి నాయకుడిపై సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టారీతిగా మాట్లాడి తేలిపోయారు అనే విమర్శలు వినిపిస్తున్నాయి. తలసరి ఆదాయాన్ని పెంచటంలో, తలసరి విద్యుత్తు వినియోగం పెంచటంలో, పరిశ్రమలకు నిరంతాయ విద్యుత్తును అందించటంలో ఆర్‌బీఐ, నీతి అయోగ్, కాగ్, బడ్జెట్ పత్రాలను ముందుపెట్టి ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్ సాధికారికంగా సభ ముందు ఉంచటంలో సఫలీకృతమైందని నిపుణులు అంటున్నారు. వైఎస్ హయాంలో ఉచిత విద్యుత్తును ప్రారంభించినా దాన్ని అద్భుతంగా బీఆర్‌ఎస్ సర్కార్ కొనసాగించిదనటంలో సందేహం లేదని సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు పేర్కొనటం కాంగ్రెస్ పార్టీని ఇరుకునపెట్టిందని అంటున్నారు.

### సభలో అధికార పక్ష సమన్వయ లోపం

కేసీఆర్ సర్కార్‌ను ఇరుకున పెట్టాలనే ఆరాటంలో సరైన కసరత్తు చేయకుండా రేవంత్ సర్కారు అభాసుపాలైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అనవసరంగా శ్వేతపత్రాల ఎజెండాను ఎత్తుకొని, వాటిపై విపక్షాలు ఎత్తిచూపిన అంశాలకు సరైన సమాధానం చెప్పలేక కాంగ్రెస్ చతికిలపడిందని అంటున్నారు. విపక్షాల ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక వ్యక్తిగత అంశాలను తెరపైకి తెవటం ద్వారా ప్రభుత్వం తేలిపోయిందనే వాదన వినిపిస్తున్నది. ఎమ్మెల్యే హరీశ్‌రావును ఉద్దేశించి కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి 'నువ్వు ఎన్నటికీ నాయకుడివి కాలేవు. నీకు కేసీఆర్, కేటీఆర్ ఎన్నటికీ అవకాశం ఇవ్వరు' అని పేర్కొంటే అందుకు దీటుగా 'డబ్బులు పెట్టి పీసీసీ పదవిని కొనుక్కున్నారని పరోక్షంగా సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి మాట్లాడితే, తిప్పికొట్టే సమాధానం అధికార పక్షం దగ్గర లేకపోయింది. మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు.. ఇలా ఎవరేం మాట్లాడుతున్నారో తెలియని అయోమయం కనిపించిందని అంటున్నారు. అక్బరుద్దీన్ లేవనెత్తిన అంశాలను వర్గ దృష్టితో చూసి సమాధానం చెప్పాలని భావించి అధికార పక్షం బొక్కబోర్లా పడిందని విమర్శిస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని చెప్పటం మా ఉద్దేశం కాదని, కరెంట్ విషయంలో బీఆర్‌ఎస్‌ను పూర్తిగా తప్పుపట్టడంలేదని, వాస్తవాలను ప్రజలకు చెప్పి తరువాత ఏం చేయాలో చేసే ప్రయత్నంలో భాగం మాత్రమేనని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యల పట్ల విస్మయం వ్యక్తం అవుతున్నది. 'బాగాలేదని చెప్పనప్పుడు శ్వేతపత్రాలు ఎందుకు? జరిగిన అభివృద్ధి ప్రజల కండ్లముందు కనిపిస్తున్నప్పుడు కనికట్టు విద్యలెందుకు?' అని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. మొత్తంగా శ్వేతపత్రాల విడుదలతో వెనుక కాంగ్రెస్ ఏం చెప్పదలచుకున్నది? ఎన్నికల హామీలు వాయిదాల పద్ధతిపై అమలు చేస్తామని చెప్పటమా? అసలు వాటి జోలికే వెళ్లము అని చెప్పదలచుకున్నదా? రైతులకు 24 గంటల నిరంతాయ ఉచిత విద్యుత్తు అమలు చేస్తారా? చేయరా? గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తామని చెప్పిన మాట నిలుపుకుంటుందా? లేదా? ఆరు గ్యారెంటీలను అమలు చేస్తారా? చేయరా? వంటి కీలక అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పకుండా వెళ్లిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### తిరగబడ్డ కాంగ్రెస్ వ్యూహం

కాంగ్రెస్ ప్రభుత్వం సరైన వ్యూహాన్ని రచించుకోక బీఆర్‌ఎస్‌ను బోనులో నిలబెట్టాలని తానే బోనులో నిలబడిందనే చర్చ జరుగుతున్నది. బలమైన విపక్షం ఉన్నప్పుడు అంతకన్నా దీటైన వ్యూహాన్ని రచించి బీఆర్‌ఎస్‌ను దెబ్బతీయాల్సింది పోయి దుందుడుకు చేష్టలతో తామే బొక్కబోర్లా పడ్డామనే అభిప్రాయం కాంగ్రెస్‌లో వ్యక్తమవుతున్నది. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు, విద్యుత్తుపై విడుదల చేసిన శ్వేతపత్రం విషయంలో కాంగ్రెస్ పార్టీ ముందుచూపులేమితో ఇరుకునపడిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 'ప్రభుత్వ శ్వేతపత్రాలపై విపక్ష సభ్యులు పూర్తి కసరత్తుచేసి ఎండగట్టారు. సాధారణంగా తక్కువ సమయంలో అసెంబ్లీ పెడితే విపక్షాలు సన్నద్ధం కావని అధికార పక్షం అనుకున్నట్టున్నది. కానీ, వాళ్లు అనుకున్నదొక్కటి జరిగింది మరొకటి' అని పలువురు రాజకీయ విశ్లేషకులు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌లో మంత్రులుగా పనిచేసినవాళ్లు అనేక అంశాలపై సమగ్ర సమాచారంతో సాధికారికంగా చెప్పేసరికి అనేక అంశాల్లో అధికార పక్షానికి నోట మాటరాలేదని పేర్కొంటున్నారు. వెరసి శ్వేతపత్రాలు తప్పుల తడకగా మారాయని, ఆర్‌బీఐ, కాగ్, బడ్జెట్, ఏది తక్కువ ఉంటదో దాన్ని తీసుకొని కేసీఆర్ సర్కార్‌ను ఇరుకున పెట్టాలని కాంగ్రెస్ ప్రయత్నం చేసి విఫలమైందని పేర్కొంటున్నారు. ప్రభుత్వానికి కొద్దిగా టైం ఇద్దాం అనే పరిస్థితులు ఉంటాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హనీమూన్ కాలాన్ని సరిగ్గా వినియోగించుకోలేక చతికిలపడుతున్నది కాంగ్రెస్ సీనియర్ నేత వ్యాఖ్యానించటం గమనార్హం.

# ముస్లింల గొంతు నొక్కుతారా?

- ఎంఐఎంను ఖతం చేయాలని కాంగ్రెస్ కుట్ర
- సీఎం రేవంత్‌రెడ్డివి అపరిపక్వ వ్యాఖ్యలు
- చస్తాం కానీ.. బీజేపీతో ఎన్నటికీ కలవం
- విద్యుత్తు శ్వేతపత్రంపై చర్చలో అక్బరుద్దీన్
- మీరు ముస్లింలందరికీ ప్రతినిధులు కాదు
- మైనార్టీలకు మేమే అధిక ప్రాధాన్యం ఇచ్చాం
- అక్బరుద్దీన్ వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో గురువారం జరిగిన చర్చ సందర్భంగా అక్బరుద్దీన్ ఒవైసీ, అధికార పక్షం మధ్య తీవ్ర మాటల యుద్ధం జరిగింది. ముస్లింల గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని అక్బరుద్దీన్ పేర్కొనగా.. ఎంఐఎం ఎమ్మెల్యేలు ముస్లింలందరికీ ప్రతినిధులు కాదని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అనేక అంశాలపై ఇద్దరి మధ్య చర్చ వాడివేడిగా సాగింది. జూబ్లీహిల్స్‌లో ఎంఐఎం పోటీపై అధికారపక్షం, సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానంపై ఎంఐఎం చేసిన వ్యాఖ్యలతో సభ ఒక్కసారిగా హీటెక్కింది. ఈ క్రమంలో ఎంఐఎం ఎమ్మెల్యేలు రెండుసార్లు వెల్‌లోకి దూసుకెళ్లారు. సీఎం రేవంత్‌రెడ్డి తన ప్రసంగంలో మాజీ సీఎం కేసీఆర్ ప్రస్తావన తీసుకురావడంతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సైతం వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు.

### పిల్లలు జోక్యం చేసుకోవద్దు

అక్బరుద్దీన్ ఒవైసీ తన నియోజకవర్గానికి సబ్‌స్టేషన్లు, కేబుళ్లు మంజూరు చేయాలని, సరఫరా సామర్థ్యాన్ని పెంచాలని కోరారు. ఈ చిన్న చిన్న పనులను పదేపదే అడగాల్సి రావటం తనకు సిగ్గుగా ఉన్నదని అన్నారు. ఈ సమయంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అడ్డు తగిలారు. 'మీరు పదేండ్లుగా ప్రభుత్వంలో ఉన్నారు. ఈ చిన్నచిన్న పనులను కూడా అడగలేదా?' అని ప్రశ్నించారు. దీంతో అక్బరుద్దీన్ పెద్దోళ్లు మాట్లాడుతుంటే పిల్లలు జోక్యం చేసుకోవద్దు. కొత్త సభ్యుడు ఇంకా ఎంతో నేర్చుకోవాలి' అని వ్యాఖ్యానించారు. ముస్లింల తరపున మాట్లాడుతున్న ఎంఐఎంను ఖతం చేయాలన్నదే కాంగ్రెస్ లక్ష్యంగా కనిపిస్తున్నదని ఆరోపించారు. 'మమ్మల్ని భయపెడదామని అనుకుంటున్నారా? మేం లొంగిపోం. కిరణ్‌కుమార్‌రెడ్డి జైలులో పెట్టినా, నగర బహిష్కరణ చేసినా భయపడలేదు. ఇప్పుడు మీరు మళ్లీ జైలులో పెట్టాలనుకుంటే మేం సిద్ధంగా ఉన్నాం?. మేం ఎవరినీ బతిమిలాడం. ముస్లింల వాణిని తెలంగాణలో ఎవరూ ఆపలేరు' అని తేల్చి చెప్పారు.

### మీకు హిందువులు ఓటేయలేదా?

అక్బరుద్దీన్ వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఎంఐఎం, బీఆర్‌ఎస్ ఒక్కటే అని పలుమార్లు అక్బరుద్దీన్ చెప్పారని, అందుకే తాము వారిని వేర్వేరుగా చూడటం లేదని అన్నారు. ముస్లింలందరి తరపున మాట్లాడుతున్నట్టు అక్బరుద్దీన్ చెప్పడం సరికాదని, ఆయనకు హిందువులు కూడా ఓటేశారని అన్నారు. 'జూబ్లీహిల్స్ నుంచి ప్రముఖ క్రికెటర్ అజారుద్దీన్‌కు కాంగ్రెస్ టికెట్ ఇస్తే ఆయనపై ఎంఐఎం నుంచి మరో ముస్లింను నిలబెట్టి ఓడగొట్టారు. కామారెడ్డిలో షబ్బీర్ అలీకి టికెట్ ఇద్దామని అనుకుంటే.. అక్బరుద్దీన్ ప్రాణ స్నేహితుడు కేసీఆర్ అక్కడ ఎన్నికల్లో నిలబడితే సహకరించారు. అలాంటి వ్యకి ముస్లింలందరికి ప్రతినిధిగా ఎలా చెప్పుకుంటారు?' అని ప్రశ్నించారు. కవ్వంపల్లి సత్యనారాయణ దళితుడని, ఎంఐఎం నేతలంతా కలిసి ఒక దళితుడిని ఇలా అవమానించడం సరికాదని అన్నారు. తమకు మైక్ ఇవ్వాలని ఎంఐఎం సభ్యులు కోరగా.. స్పీకర్ అనుమతించలేదు. దీంతో వారు వెల్‌లోకి దూసుకొచ్చారు.

### విద్యుత్తు బకాయిలు మీరు కట్టిస్తారా?

రాష్ట్రంలో విద్యుత్తు బకాయిలు చెల్లించని ప్రాంతాల్లో సిద్దిపేట, గజ్వేల్, హైదరాబాద్ సౌత్ మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. సిద్దిపేట డివిజన్‌లో 61.37%, గజ్వేల్ డివిజన్‌లో 50.29%, హైదరాబాద్ సౌత్‌లో 43 శాతం సరఫరా నష్టాలు ఉన్నాయని తెలిపారు. విద్యుత్తు రంగం దివాలా తీయడానికి ఈ మూడు ప్రాంతాలే కారణమని అన్నారు. హరీశ్‌రావు, కేసీఆర్, అక్బరుద్దీన్ ఒవైసీ వారి ప్రాంతాల్లోని మొండి బకాయిలు చెల్లించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. మైనార్టీల సంక్షేమం గురించి ఎవరి దగ్గరా నేర్చుకోవాల్సిన అవసరం కాంగ్రెస్‌కు లేదని అన్నారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇచ్చామని అన్నారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై అక్బరుద్దీన్ స్పందించారు. రాజకీయ పార్టీలకు నచ్చిన చోట పోటీ చేసే హక్కు ఉంటుందని తెలిపారు. 'మా నియోజకవర్గాల్లో మాపై పోటీగా కాంగ్రెస్ తరపున ముస్లింలకు టికెట్లు ఇచ్చారు. అలాగని మీరు ముస్లింలను గెలవనీయకుండా ప్రయత్నించారని నిందించాలా? ఇదేం ఇమ్మెచ్యూర్ టాక్ (అపరిపక్వ వ్యాఖ్యలు)' అని ఘాటుగా స్పందించారు. అంబేద్కర్ ఓటమికి కారణం ఎవరో అందరికీ తెలుసన్నారు. కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్ ఇచ్చిందన్న వ్యాఖ్యలపై అభ్యంతరం తెలిపారు. ఆ సమయంలో రేవంత్ కాంగ్రెస్‌లో లేరని, ఎక్కడున్నారో తనకు తెలియదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన గృహజ్యోతి పథకం అమలు చేస్తే ఎంత ఆర్థిక భారం పడుతుందనేదానిపై ప్రభుత్వం ఏమైనా కసరత్తు చేసిందా అని అక్బరుద్దీన్ ప్రశ్నించారు. తన అంచనా ప్రకారం ఏటా రూ.4,800 కోట్లు ఖర్చవుతుందని చెప్పారు. ఈ మొత్తాన్ని డిస్కంలకు ప్రభుత్వం సబ్సిడీ ద్వారా ఇస్తుందా? లేక ఇతర క్యాటగిరీల్లో చార్జీలు పెంచుతుందా? అని ప్రశ్నించారు. డిస్కంల బకాయిలను చెల్లించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారో చెప్పాలన్నారు.అనేక అంశాలు శ్వేతపత్రంలో లేవన్నారు. 'ఆర్థిక శ్వేతపత్రంలో విద్యుత్తు అప్పులు రూ. 82,893 కోట్లుగా చెప్పారు. విద్యుత్తుపై శ్వేతపత్రంలో అప్పు రూ.78,554 కోట్లుగా ఉన్నది. ఈ తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి' అన్నారు.

### అవమానించిన చోటే విద్యుత్తు వెలుగులు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తెలంగాణ అంధకారంలో మునుగుతుందని, కరెంటు తీగలపై బట్టలు ఆరేసుకోవచ్చని నాడు ఉమ్మడి రాష్ట్ర సీఎం కిరణ్ కుమార్ రెడ్డి అవమానించారని అక్బరుద్దీన్ గుర్తు చేశారు. 2014 నాటికి ఉమ్మడి ఏపీలో విద్యుత్తు రంగం దారుణంగా ఉండేదని, క్రాప్ హాలిడేలు ప్రకటించారని గుర్తుచేశారు. అప్పుల బాధతో అనేక మంది ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు. 10వేల పరిశ్రమలు మూతబడ్డాయని,జనరేటర్లు, కన్వర్టర్లు, ఇన్వర్టర్లు ప్రతి ఇంటిలో కనిపించేవని చెప్పారు. కానీ కేసీఆర్ హయాంలో ఎవరూ ఊహించని విధంగా మారిపోయిందని చెప్పారు.